# యనీ బ్యూటిఫుల్ గర్ల్

## కెన్ రీడ్ దిన్

అందమైన ఆదివారం వచ్చింది.

శశి, విజిత విమల— అవ్వాళ "నెహ్రూ జూలాజికల్ గార్డెన్స్"కు వెళ్ళాలనుకుని ప్రోగ్రామ్ ముందుగానే ఫిక్స్ చేసుకున్నారు.

వారి భర్తలు మాత్రం ఏవో "పార్టీ" అంటూ వెళ్ళారు.

ముత్యాల్లా ముగ్గురూ సిటీబస్ ఎక్కారు.

భాగ్యనగరం అందంగా మెలికలు తిరిగి పోతూవుంది.

రాజేంద్రనగర్ దారిలో దిగారు.

జూలాజికల్ గార్డెన్స్‌వైపు దారితీశారు.

ఆదివారం కావటం మూలాన రద్దీగానే వుంది. అందంగా, ఆనందంగా ఆ గార్డెన్స్‌ను చూచేందుకొచ్చారు, ప్రజలు.

వేడివేడి మిరపకాయల బజ్జీలు స్పెషల్‌గా కట్టించుకున్నారు, శశి, విజిత, విమల.

సాయంకాలం నాలుగు కావస్తుంది.

ఒక్కొక్క 'జీవి'ని విచిత్రంగా చూడసాగారా జీవులు.

సరదాగా నవ్వుకుంటూ "ఐస్ క్రీమ్‌లు" తిన్నారు. వారి వారి భర్తలు గుర్తొచ్చారు. శశికి బుగ్గలు ఎరుపెక్కాయి. విజితకు కళ్ళు మెరిశాయి, విమల ఎడద పొంగింది.

కాస్సేపటికి అలసిపోయ్యారా అతివలు.

ఎత్తైన ఓ గుట్ట విరబూసిన ఓ పొద—అక్కడికెళ్ళి కూర్చొని తినాలనుకున్నారు మిరపకాయ బజ్జీలు. ఆ ప్రక్కనే, దిగువలో పూలు విరబూసిన ఓ సరస్సు కనిపిస్తూవుంది. దాపులో ఓ కుళాయి వుంది.

అంతా ఆహ్లాదంగా వుంది.

సాయత్రం ఆ గుట్టెక్కారు నవ్వులు విరజిమ్ముతూ. మొదట ఎక్కిన విజిత కళ్ళకు ఒక తెల్లటి చీటి కానవచ్చింది దానిపై నల్లని అక్షరాలు కొట్టొచ్చినట్లు అగుపిస్తున్నాయ్! "యనీ బ్యూటీఫుల్ గర్ల్ కెన్ రీడ్ దిస్."

ద్వయం ఆమెను చేరుకున్నాక "ఏమండోయ్ నేను బ్యూటిఫుల్‌గా లేనూ? అన్నది విజిత, విశాల నేత్రాలను విచిత్రంగా త్రిప్పుతూ.

"అదేమిటోయ్, ఆ మాట, అప్సరసలా వున్నావ్, మీ ఆయన యింతసేపు నిన్ను విడిచి, అసలు ఎలా వున్నాడో పాపం!" అన్నది రోజా బుగ్గలు నొక్కుకుంటూ శశి.

'అసలా అనుమానం ఎందుకొచ్చిందోయ్ నీకు?' విమల నిలదీసి అడిగింది.

"ఎందుకా?" విజిత ఆ చీటీని అందుకుంటూ అన్నది, "ఇందుకు."

మూడు తలలు మురిపెముగా ఓ చోట చేరాయి.

ఆ ఇంతుల నయనాలు విశాలమయ్యాయి.

కను బొమ్మలు పైకి లేచాయి.

పెదాలు సున్నాలు చుట్టాయి.

ఆ చీటీ విప్పి, చదవసాగింది విజిత—

"మై డియర్ బ్యూటీ! అప్పుడే విరబూసిన పువ్వులన్నా, అందమైన అమ్మాయిలన్నా నాకు అమిత మక్కువ. నేను అందాన్ని ఆరాధిస్తాను, ఆనందాన్ని అందిస్తాను సౌందర్యాన్ని నా హృదయంలో పరుండ బెట్టుకొని, స్వర్గంలో నందనవనాలను సందర్శింప చేస్తాను, ఆరాధనలో మైమరిపిస్తాను మనసును మురిపిస్తాను. ప్రేమను కురిపిస్తాను. ఈ సౌందర్య పిపాసిని కలుసుకోవాలంటే, ఈ క్రింది అడ్రసుకు రేపటి ఆదివారం సాయంకాలం నాలుగు గంటలకు రావచ్చు.

నేను నీకోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తూ వుంటాను. ఒంటరిగా, నీవు వస్తావు. రాకుండా వుండలేవు. రాకపోతే నీవు అందగత్తెవు కావన్న మాట నీ అందాన్ని రుజువు చేసికోవాలనుకుంటే, నా ఆరాధనను అందుకోవాలంటే తప్పక వస్తావు....

—ఏదో అడ్రసు ఇచ్చాడు మరికొన్ని వివరాలు ఇచ్చాడు! అంతే! పేరు లేదు. క్రింద "నీ ఆరాధనామూర్తి అని మాత్రం వుంది.

"బూతు, ఛీ—" డోకింది శశి

"వెర్రివేషాలు, వెదవలు, పారేయవోయ్. అసలది మనకు కాదు, అమ్మాయిలకు" విమల క్లారిఫై చేసింది

"శశీ, విమలా; వినండి! పెళ్ళయిపోయింది కానీ, మనం మాత్రం అమ్మాయిలం కాదూ, అందంగా లేమూ?" నవ్వుతూ అన్నది విజిత. విజిత నైజం వాళ్ళను విస్మయపరిచింది.

"అయితే.... యూ మీన్ ..." శశిని అందుకుంది విమల 'ఆ వెధవ ఆరాధనమూర్తిగాడి దగ్గరకి వెళదాం– అనేనా!'

నిట్టూర్చింది విజిత. 'అది కాదండోయ్, కూర్చోండి చెబుతాను'.

కూర్చున్నారు.

'ఆడదంటె యింత చులకనా ఈ మగవాడికి, పైగా కవిత్వం వెధవ! ఏమయినాసరే వీడికి బుద్ది చెప్పాల్సిందే మళ్ళీ ఇలాటి వేషాలు వెయ్యకుండా గూబ గుయ్యిమనాలి, రాస్కెల్ కి' ఉక్రోషంగా అన్నది విజిత.

"ఎంజలా డేవిస్‌లా ఏమిటా సాహసం. మనం సంసార స్త్రీలమన్న మాట మరచిపోతే ఏలా? ఇలా తెగించటం మంచిదికాదు" భయం. మందలింపు శశి ధోరణిలో వుంది.

నవ్వింది తేలిగ్గా విజిత. 'మిలిటరీ ఆఫీసరు భార్యవు అంతగా భయ పడతావేమే, అబలనేగా ఈ మగవాళ్ళకింత అలుసు?' అక్కసు వెళ్ళ గ్రక్కింది విజిత.

'అంతగా అయితే నువ్వెళ్ళు. మీ వారితో మేము రాము బాబూ' అయిష్టంగా, నిక్కచ్చిగా చెప్పింది విమల.

"వారు రారే" దిగాలుపడింది విజిత.

"ఆదివారం కాలేజీ వుండదుగా, మీ వారు ఇంట్లోనె వుంటారు." శశి గుర్తు చేసింది. ఈ సమస్యనుండి తప్పుకోవాలన్నది మిగిలిన ఇద్దరి ధోరణి

"లెక్చరర్‌ను చేసికోవడం నా ఖర్మ. అందులో సైకాలజి లెక్చరర్‌ను అసలు చేసుకోకూడదు." విజిత మాటకు విమల అడ్డు వచ్చింది "ఎందుకనోయ్?

విజిత గొంతు తగ్గింది. "ఆదివారం ఒక్కరోజు హాలిడే కదా! అలా జాలీగా గడుపుదాం, అనుకోరు. ఏవో ఎక్‌స్ట్రా క్లాసులనీ, పార్టీలనీ ప్రతి ఆదివారం ఎక్కడికో ఓ చోటికి వెళ్ళిపోతూ వుంటారే! అందునా ఈ మధ్య ఏదో పరిశోధన కూడా చేస్తున్నారట. క్షణం తీరికలేక ఎప్పుడూ బిజీగా కనిపిస్తారు." ఏదో అసంతృప్తి, అవ్యక్తమయిన బాధ ఆమెలో గోచ రించాయి. అంతలోనే తేరుకుంది.

"అసలు ఈ విషయం ఇంతటితో మరచిపోదాం, మనకెందుకొచ్చిన గొడవ. బజ్జీలు తిందామా?" శశి అంటూ, తినటం మొదలు పెట్టింది. విమల జోడైంది

విజిత మనసు మాత్రం ఆ 'ఆరాధనమూర్తి"ని గూర్చి ఆలోచించ కుండా ఉండలేకపోయింది.

మరి ఆదివారం వచ్చింది.

నాలుగు గంటలు కావస్తూవుంది.

గబగబా డ్రెస్ వేసికుంటున్న శ్రీనివాసరావు దగ్గరికొచ్చి, మురిపెంగా టైం పట్టుకొని, "ఏవండి ఇవ్వాళ మీరు నాతో తప్పకుండా ఓ చోటుకి రావాలి, మీకో కొత్త విషయం చెబుతాను" అన్నది గారాలు ఒలికిస్తూ విజిత.

విజిత కళ్ళలోకి ప్రేమగా చూస్తూ, చెలిచెక్కిలిపై మృధువుగా వ్రేలితో మీటి, "క్షమించు విజ్జీ ఇవ్వాళ క్లబ్బులో ముఖ్యమయిన పార్టీ వుంది. ఈ పాటికే అంతా వచ్చేసి వుంటారు. టంచన్‌గా నాల్గు గంటలకల్లా నేను అక్కడ వుండాలి. ప్లీజ్, డోన్ట్ తింక్ అదర్‌వైజ్. మరోమారు తప్పకుండా నీతో వస్తాను, "అంటూ బూట్లు కట్టుకొని, టకటకా వెళ్ళి పొయ్యాడు శ్రీనివాసరావు.

విజితకు ఏడుపొచ్చినంత పనయింది.

ముందుగా తెలియపరిచివుంటే బావుండేది, ప్చ్—

అసంతృప్తి స్థానంలో రోషం పుట్టింది. ఒక నిర్ణయానికి వచ్చింది విజిత

"ఆరాధనామూర్తి" అడ్రసుకు బయలుదేరింది. ఒకే విషయాన్ని గూర్చి పదేపదే ఆలోచిస్తే దాని ఎఫెక్టు మనిషిమీద చాలా వుంటుంది. సిగ్మండ్ ఫ్రాయిడ్ సిద్ధాంతాన్ని శ్రీనివాసరావు అప్పుడప్పుడు చెబుతూ వుంటాడు భార్యతో.

సాహసంతో ముందుకు సాగింది విజిత.

నాలుగున్నరకు ఎలాగో ఆ అడ్రసు చేరుకోగలిగింది.

మేడమీదికి పోవాలి.

గుండెలు దడదడ లాడాయి.

చుట్టూ చూసింది, రోడ్డుమీద జనం వున్నారు. ఆ మేడ క్రింద పోర్షన్‌లో మాత్రం ఎవ్వరూ వున్నట్టు లేదు

ధైర్యం తెచ్చుకొని, మెట్లెక్కింది చమటలు పోస్తున్నాయ్, కాళ్ళు వణుకుతున్నట్లున్నాయ్, కళ్ళు తిరుగుతున్నట్లున్నాయ్, ఎవరో తనని చూచి నవ్వినట్లుంది

తిరిగి చూచింది.

ఎవ్వరూ లేరు. అంతా భ్రమ....

పవిటి ఒంటినిండా కప్పుకుని, మెట్లెక్కింది.

గది తలుపులు మూసి వున్నాయ్.

వెలుపల గొళ్ళెం పెట్టలేదు. అంటే? లోపల ఆ ఆరాధనమూర్తి....

ఆలోచించలేక పోయింది, అంతకుమించి— వెనుదిరిగి వెళదామా? అనిపించింది. రోడ్డువైపు మళ్ళీ చూసింది, ప్రజలు— తలుపులమీద మెల్లగా తట్టింది భయం స్థానే కోపం ఉబుకుతుంది.

"కమిన్" లోపలి కంఠం.

రెండు చేతులతో ఒకేసారి తలుపులు తెరిచింది భళ్ళున—

ఎదురుగా ఛైర్‌లోంచి నవ్వుతూ పైకిలేచిన శ్రీనివాసరావు ముఖం నివ్వెర పోయింది విజిత విచలిత అయింది.

ఓ క్షణం నిశ్శబ్దం రాజ్యం చేసిందా గదిలో.

సైకాలజీ లెక్చరర్ శ్రీనివాసరావు అలాగే నిలుచుండి పోయాడు బొమ్మలా—

విజిత పరుగునవెళ్ళి, శ్రీనివాసరావు చొక్కా పట్టుకొని లాగి, గుండెలమీద ఆవేశంగా కొడుతూ, "నేను బ్యూటిఫుల్‌గా లేనూ?" అంటూ ఏడవసాగింది.

★